సీసీ రోడ్డు పనులు పరిశీలన

బడంగ్‌పేట, జూన్20ః బడంగ్ పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధి లోని గుర్రంగూడలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్ లక్ష్మారెడ్డితో కలిసి మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి గురువారం పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ పనులు చేయాలన్నారు. పనులు చేస్తున్న క్రమంలో అధికారులు దగ్గరుండి చూసుకోవాలన్నారు. అధికారుల పర్యవేక్షణ లేకుంటే నాణ్య త ప్రమాణాలు దెబ్బతింటాయన్నారు. కాంట్రాక్టర్లు పనులు జాగ్రత్తగా చేయాలన్నారు. అధికారులు, స్థానికులు తదితరులు ఉన్నారు.,

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

మన్సూరాబాద్, జూన్ 20: నాగోల్ డివిజన్ పరిధి శ్రీసాయినగర్ కాలనీలోని శ్రీదుర్గాదేవి దేవాలయం 19వ వార్షిక బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ చైర్మన్ పోచబోయిన గణేశ్ యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. శుక్రవారం నుంచి ఆదివారం వరకు మూడు రోజుల పాటు వార్షిక బ్రహోత్సవాలను నిర్వహించనున్నారు. మొదటి రోజు శుక్రవారం ఆలయంలో 108 కలశాలతో అభిషేకము, గణాధిపతి పూజ, పుణ్యాహ వాచనము, మాతృక, యోగిని, వాస్తు, నవగ్రహపూజ, సర్వతోభద్ర మండల స్థపనము, కలశస్థాపనము, చతుషష్టి ఉపచారపూజ, అగ్నిప్రతిష్ఠ స్థాపిత దేవతాహవనము తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. చివరి రోజు ఆదివారం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ పోచబోయిన గణేశ్‌యాదవ్ మాట్లాడుతూ మూడు రోజుల పాటు నిర్వహించనున్న శ్రీదుర్గాదేవి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాలకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి పూజా కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

కాంగ్రెస్ హామీలు నీటి మూటలేనా!

- కల్యాణ లక్ష్మితో పాటు తులం బంగారం ఏమైంది...
- చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, జూన్ 20: కల్యాణ లక్ష్మితో పాటు తులంబంగారం ఇస్తామని ఆడ బిడ్డలకు ఇచ్చిన హామీ ఎందుకు నెరవేర్చడం లేదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కాంగ్రెస్ హామీలు నీటి మూటలేనా అని ఎద్దేవా చేశారు. గురువారం మహేశ్వరం మండలంలో ఏర్పా టు చేసిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆమె హాజరై 148 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. అనంతరం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థులకు నులి పురుగుల నివారణ మందులు వేశారు. నులి పురుగుల నివారణకు తీసుకోవలసిన చర్యల పై ఏర్పాటు చేసిన పోస్టర్ ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహేశ్వరం మండలంలో 123 మందికి, తుక్కుగూడలో 25 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశామన్నారు. మహేశ్వరం మండలంలో ఇప్పటి వరకు 2500 మందికి కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశామన్నారు. మహేశ్వరం మండలంలో రూ.22.22 కోట్లు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల ద్వారా ఇచ్చామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూరే విధంగా గత ప్రభుత్వం పనిచేసిందన్నారు. కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ ద్వారా ఆడ బిడ్డలకు న్యాయం చేసిన ఘనత మాజీ సీఎం కేసీఆర్ దే అన్నారు. నీటి సమస్యను పరిష్కరించాలన్న లక్ష్యంతో కేసీఆర్ మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికీ నల్లా కనెక్షన్ ఇచ్చారన్నారు. మహిళలు బిందెలు పట్టుకొని బయటకు రాకూడదన్న ఉద్దేశంతో కేసీఆర్ ఈ నిర్ణయం తీసుకున్నారన్నారు. మహిళలు బిందెలతో బయటకు రాకుండా ఉండటానికి ప్రతి ఇంటికి నీటి సరఫరా చేయించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి కూడా నెరవేర్చలేదన్నారు. తులం బంగారం ఇస్తామని, రూ. 2500లు ఇస్తామన్న ప్రభుత్వం ఇప్పటికైనా అమలు చేయాలన్నారు. నులి పురుగుల నివారణకు విద్యార్థులకు తప్పని సరిగా నులి పురుగుల మాత్రలు వేయించాలని ఆమె పిలుపునిచ్చారు. ఎంపీపీ సునీతా అంధ్యానాయక్, తుక్కుగూడ వైస్ చైర్మన్ భవానీ వెంకట్ రెడ్డి, లక్ష్మయ్య, శ్రీకాంత్ గౌడ్, అంబయ్య యాదవ్, చంద్రయ్య, ఎంపీటీసీలు వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

మహేశ్వరం బాలికల ఉన్నత పాఠశాలలో నులి పురుగుల మాత్రలు వేస్తున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

ఆర్కేపురం, జూన్ 20 : సరూర్‌నగర్, ఆర్కేపురం డివిజన్లలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అధికారులకు సూచించారు. గురువారం జిల్లాలగూడ క్యాంపు కార్యాలంలో సరూర్‌నగర్, ఆర్కేపురం డివిజన్ల జీహెచ్ఎంసీ, వాటర్‌వర్క్స్, ఎలక్ట్రికల్ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. రెండు విజన్ల లోని కాలనీలు, బస్తీలలో జరుగుతున్న, జరగాల్సిన పనుల గురించి ఆరా తీశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. సమావేశంలో అధికారులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ మాత్రలు వేయించాలి

చిన్నారులకు మాత్రలు వేస్తున్న ప్రజాప్రతినిధులు

కందుకూరు, జూన్ 20 : 19 ఏండ్లలోపు పిల్లలకు నులి పురుగుల నివారణ మాత్రలను తప్పని సరిగా వేయించాలని కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రి డాక్టరు రాధిక తెలిపారు. జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా నులిపురుగుల నివారణ మందులను గురువారం మండల కేంద్రంలో గల ప్రభుత్వ కస్తూర్బా బాలికల పాఠశాలలో ఎంపీపీ మంద జ్యోతి పాండు, జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, వైఎస్ ఎంపీపీ గంగుల శమంత ప్రభాకర్‌రెడ్డిలతో కలిసి చిన్నారులకు వేశారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మన్సూరాబాద్, జూన్ 20: మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ పరిధి ఎల్లారెడ్డి కాలనీలోని కమ్యూనిటీ హాల్లో గురువారం సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 63 మంది పరీక్షలు చేయించుకున్నారు. బీపీ, షుగర్, కీళ్ల నొప్పులు తదితర జబ్బులకు పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా ముందులను పంపిణీ చేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్ కోసం ఉచితంగా వైద్య సేవలను అందించేందుకు రెడ్‌క్రాస్ సొసైటీ ముందుంటుందన్నారు. డాక్టర్ పాండు, కాల నీ సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

రామోజీరావుకు ఘన నివాళి

మన్సూరాబాద్, జూన్ 20: ఒత్తిళ్లకు తలొగ్గకుండా సమాజ హితం కోసం అక్షరాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తి రామోజీరావు చిరస్మరణీయుడని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త అన్నారు. ఆకృతి సంస్థ ఆధ్వర్యంలో నాగోల్‌లోని కోఆపరేటివ్ బ్యాంకు కాలనీలో గురువారం ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు సంస్మరణ సభను నిర్వహించారు. ఉప్పల శ్రీనివాస్‌గుప్త ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నైతిక విలువలకు పెద్దపీట వేసి నిజాలను నిర్భయంగా వెల్లడించడంలో ఏనాడు రామోజీరావు వెనుకడుగు వేయలేదన్నారు. ఆకృతి సుధాకర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో దైవజ్ఞశర్మ, ఉడయవర్లు, శ్రీనివాస్, ఉప్పల స్వప్న, భాగ్యలక్ష్మి, మంజుల, సర్వాచారి, హర్ష, శివ పాల్గొన్నారు.

రామోజీరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్త,తదితరులు

సంక్షేమ పథకాలు వినియోగించుకోవాలి

లబ్ధిదారులకు షాదీముబారక్, కల్యాణ లక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే బలాల

సైదాబాద్, జూన్ 20 : ప్రభుత్వ సంక్షేమ పథకాలను పేద ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల సూచించారు. గురువారం పాతబస్తీ ఫంజేషాలోని తన కార్యాలయంలో నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన 76 మంది మహిళలకు షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదింటి ఆడబిడ్డలకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకం ఓ వరంలాంటిందని, దీంతో ఎంతో మంది లబ్ధిపొందుతున్నారని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకునే విధంగా క్షేత్రస్థాయిలో ప్రజలను చైతన్యవంతుల్ని చేయాలని రెవెన్యూ అధికారులకు ఆదేశించారు. రెవెన్యూ అధికారులు, ఎంఐఎం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ బలోపేతానికి కృషి చేయాలి

విట్టల్‌రెడ్డి, మహేంద్రకుమార్‌రెడ్డిలను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

కందుకూరు, జూన్ 20 : లయన్స్ క్లబ్ బలోపేతానికి కృషి చేయాలని వైస్ గవర్నర్ డాక్టరు మహేందర్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కందుకూరు లయన్స్ క్లబ్ సమావేశం గురువారం నిర్వహించారు. లయన్స్ క్లబ్ సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా సురుసాని విట్టల్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సెక్రటరీగా తీగల జగదీశ్వర్‌రెడ్డి, కోశాధికారిగా కుంచకూరి వెంకటేశ్వర్లు గుప్తలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మహేందర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కందుకూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. పేదల సంక్షేమానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు తాళ్ల అంజయ్య, బీఆర్ రాంరెడ్డి, సురుసాని వెంకటరంగా రెడ్డి,సభ్యులు పాల్గొన్నారు.

స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి

సైదాబాద్, జూన్ 20 : పాఠశాలలో విద్యార్థులకు మౌలిక వసతులను కల్పించలేని సైదాబాద్ జయనగర్‌లోని సెయింట్ అంద్రూస్ పాఠశాల యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం విద్యార్థుల తల్లిదండ్రులు సైదాబాద్ జోన్ ఉప విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. పాఠశాలలో నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలను విక్రయించటమే కాకుండా, అధిక ఫీజులను వసూలు చేస్తూ తల్లిండ్రులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న పాఠశాల యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులను కోరారు. శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని సైదాబాద్ జోన్ ఉప విద్యాశాఖ అధికారి రాధాకృష్ణ తమకు హామీ ఇచ్చారని వారు పేర్కొన్నారు.

శుభాకాంక్షలు

మన్సూరాబాద్, జూన్ 20: తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా నియమితుడైన పటేల్ రమేశ్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలుసుకుని పుష్ప గుచ్ఛం అందజేసి సన్మానిస్తున్న కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా ప్రధానకార్యదర్శి జాలే వెంకట్‌రెడ్డి, మన్సూరాబాద్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుడ్డ సత్యనారా యణ, సింగిరెడ్డి జనార్దన్‌రెడ్డి, దుబ్బాక గోపాల్ రెడ్డి, ఎర్ర శేఖర్‌గౌడ్, కడారి బాలకృష్ణ, కడారి శ్రీనివాస్ తదితరులు.

చైన్ స్నాచర్ అరెస్టు

బడంగ్‌పేట, జూన్20: చైన్ స్నాచర్‌ను అరెస్టు చేసినట్లు సీఐ కాశీ విశ్వనాథ్ తెలిపారు. సీఐ కథనం ప్రకారం... సర్వే పల్లి వినయ్ బీఎన్‌రెడ్డి నగర్‌లో ఉంటున్నాడు. చెడు వ్యసనాలకు అలవాటు పడి దొంగతనాలు చేస్తున్నట్లు తెలిపారు. దొంగతనం చేసిన తర్వాత జల్సాలు చేస్తాడు. ఇటీవల హస్తినాపురం టీచర్ కాలనీలో నడ్చుకుంటూ వెళ్తున్న ఓ మహిళ మెడలోంచి బంగారు పుస్తెల తాడు ఎత్తుకెళ్లాడు. అతడి నుంచి 14 గ్రాముల బంగారు పుస్తెల తాడు, ఓ గ్లామర్ బండి రికవరీ చేసినట్లు తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని పేర్కొన్నారు.

నేడు పెద్దచెరువు ప్రాంగణంలో యోగా డే

మన్సూరాబాద్, జూన్ 20: అంతర్జాతీయ యోగా డేను శుక్రవారం మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని పెద్దచెరువు ప్రాంగణంలో నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి తెలిపారు. యోగా గురువు భరత్‌భూషణ్ పర్యవేక్షణలో యోగా డే వేడుకలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో యోగా చేయడం వలన కలిగే లాభాలపై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ప్రతి రోజు ఉరుకులు, పరుగుల జీవితాలతో నిత్యం బిజీగా ఉండే ప్రజలు తమ ఆరోగ్య పరిరక్షణ కోసం ఒక గంట పాటు యోగా లేదా వ్యాయామం, వాకింగ్ చేయడాన్ని అలవర్చుకోవాలని సూచించారు.

పేదలకు అండగా సీఎం సహాయనిధి

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్, జూన్ 20: సీఎం సహాయనిధి పేదల జీవితాల్లో వెలుగులు నింపుతుందని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ పరిధి పవనగిరికాలనీకి చెందిన భరత్‌చంద్ర ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ నగరంలోని ఓ ప్రైవేటు దవాఖానలో చేర్పించారు. అతడికి అత్యవసరంగా ఆపరేషన్ చేయాల్సిన పరిస్థితుల్లో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న కుటుంబ సభ్యులు విషయాన్ని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆయన స్పందించి భరత్‌చంద్ర ఆపరేషన్ కోసం సీఎం సహాయనిధి నుంచి రూ. 1.15 లక్షల ఎల్వోసీని మంజూరు చేయించి బాధితుడి కుటుంబానికి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ పేదల ఆరోగ్య పరిరక్షణకు సీఎం సహాయనిధి ఎంతగానో తోడ్పాటునందిస్తుందన్నారు. ఆపదలో ఉన్న వారు అధునాతన వైద్య సేవలు పొందేందుకు సీఎం సహాయనిధి అండగా ఉంటుందన్నారు. నాయకుడు రఘుమారెడ్డి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎల్వోసీ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న చంపాపేట నెహ్రూనగర్ అసోసియేషన్ అధ్యక్షుడు సతీశ్‌గౌడ్

విద్యుత్ కేబుల్ వేయకుండా చూడాలి..

చంపాపేట: చంపాపేట డివిజన్ పరిధి కటికోనికుంట బస్తీ, శిఖరా ఎన్‌క్లేవ్, రాఘవేంద్ర కాలనీలకు సంబంధించిన సుమారు 15 అడుగుల విస్తీర్ణంతో ఉండే వీధుల్లో, ప్రమాదకరమైన 33/కేవీ విద్యుత్ కేబుల్ వేసేందుకు తవ్వకాలు చేపడుతున్నారు. ఈ కేబుల్ వేయకుండా చూడాలని ఆయా కాలనీల బస్తీల ప్రజలు నెహ్రూనగర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని గురువారం కలిసి వినతి పత్రం అందజేసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు బీసుకుంట్ల సత్తీశ్‌గౌడ్ తెలిపారు. ఈ వీధుల్లో ఎప్పటి నుంచో విద్యుత్ స్తంభాల కేబుల్స్ ద్వారా సరఫరా అవుతున్న విద్యుత్‌ను తొలగించి అండర్ గ్రౌండ్ కేబుల్ వేసేందుకు అధికారులు, అక్కడ కాంట్రాక్టర్‌ను పంపించి కొంత మేరకు తవ్వకాలు చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న తామంతా అడ్డుకుని తమ కాలనీల గుండా ప్రమాదకరమైన 33/కేవీ అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ వేయటానికి వీల్లేదని అభ్యంతరం చెప్పినా, కాంట్రాక్టర్ అదేమీ ఖాతర్ చేయకుండా మొండిగా వ్యహరిస్తూ తవ్వకాలు చేపడుతున్నాడని ఎమ్మెల్యేకు వివరించారు. వెంటనే ఎమ్మెల్యే స్పందించి విద్యుత్ అధికారులతో మాట్లాడి ఆయా ప్రాంతాల్లో అండర్‌గ్రౌండ్ కేబుల్ వేయకుండా చూస్తానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. సత్తీశ్ గౌడ్, యాదగిరి, శ్యామ్‌కుమార్, నరేందర్, రమేశ్ పాల్గొన్నారు.

15 రోజులుగా రోడ్డుపై మురుగునీరు

చంపాపేట, జూన్ 20: లింగోజిగూడ డివిజన్ పరిధిలోని కర్మన్‌ఘాట్ నుంచి సరూర్‌నగర్ వెళ్లే ప్రధాన రోడ్డు మార్గంలో సుమారు 15 రోజుల నుంచి అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ మురుగునీరు పొంగిపొర్లుతూ.. రోడ్డుకు విస్తారంగా ఏరులై పారుతుంది. దీంతో అ మార్గంలో వెళ్లే వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. సంబంధిత అధికారులకు ఏ మాత్రం ఈ సమస్య పట్టడం లేదని స్థానిక అల్తాఫ్‌నగర్, వడ్డెరబస్తీ ప్రజలు విసిగిపోయి గురువారం అ మురుగు నీటిలోకి దిగి ప్రజా పాలన తీరును ఎండగడుతూ నిరసన తెలిపారు. వీరికి మద్దతుగా లింగోజిగూడ మాజీ కౌన్సిలర్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు చిత్తలూరి వెంకటేశ్వర్లు అక్కడికి చేరుకుని మాట్లాడారు.

నీరు నిల్వకుండా చర్యలు తీసుకుంటాం

వర్షపు నీటిని పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్ వెంకన్న

సైదాబాద్, జూన్ 20 : కాలనీ సర్వీస్ రోడ్లపై వరదనీరు నిల్వకుండా చర్యలు తీసుకుంటామని సౌత్ జోన్ జోనల్ కమిషనర్ వెంకన్న అన్నారు. గురువారం ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని ఏపీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ హౌసింగ్ కాలనీలో స్థానిక కార్పొరేటర్ జంగం శ్వేత, జీహెచ్ఎంసీ సంతోష్‌నగర్ సర్కిల్ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న పాటి వర్షాలకు కాలనీ సర్వీస్ రోడ్లపై వర్షపు నీరు నిల్వటంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని కార్పొరేటర్ తన దృష్టికి తీసుకొని రావటంతో సమస్యను స్వయంగా పరిశీలించేందుకు వచ్చానని తెలిపారు. కాలనీ రోడ్లపై వర్షపునీరు నిల్వకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులను అదేశించారు. భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, జీహెచ్ఎంసీ ఈఈ ఏకాంబరం, ఏఈ అన్సారీ, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు దేవేందర్ రెడ్డి, విజయ్‌కుమార్, మహేందర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యోగా డే పోస్టర్ ఆవిష్కరణ

మన్సూరాబాద్, జూన్ 20: అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ (ఐవీఎఫ్), రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్త ఆధ్వర్యంలో గురువారం నాగోల్‌లోని కోఆపరేటివ్ బ్యాంకు కాలనీలో ఐవీఎఫ్ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు.శుక్రవారం నిర్వహించుకోనున్న అంతర్జాతీయ యోగా డే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్‌గుప్త మాట్లాడుతూ ఈనెల 23న యాదాద్రి భువనగిరి జిల్లాలో నిర్వహించనున్న అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి, ఈనెల 29న కొత్తపేటలోని కన్యక పరమేశ్వరి దేవాలయంలో నిర్వహించే దత్తాత్రేయ వ్రతానికి పెద్ద ఎత్తున ఐవీఎఫ్ ప్రతినిధులు తరలిరావాలని సూచించారు. సమావేశం సందర్భంగా పలు కార్యవర్గాలను విస్తరించారు. అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పోతుగంటి ప్రవీణ్‌కుమార్, పర్యావరణ పరిరక్షణ చైర్మన్‌గా భావన శ్రీనివాస్‌ను నియమిస్తూ ఉత్తర్వులను జారీ చేశారు.